సాక్షి
రంగారెడ్డి
ఆదివారం । 17 । నవంబర్ । 2024



పేలిన రిఫ్రిజిరేటర్ సిలిండర్

రిఫ్రిజిరేటర్‌లోని గ్యాస్ సిలిండర్ పేలి అపార్ట్ మెంట్‌లోని ఓ ఫ్లాట్‌లో మంటలు వ్యాపించాయి.

8లో▸



లక్ష్యాలను చేరుకోవాలి

ఎస్‌హెచ్‌జీకి నిర్దేశిత లక్ష్యాల మేరకు రుణ సదుపాయం కల్పించాలని అధికారులను ఆదేశించారు.

8లో▸



బీసీ మహాసభ కొత్త కమిటీ

షాద్‌నగర్‌లో నిర్వహించిన బీసీ మహాసభ సమావేశంలో మహాసభ జిల్లా అధ్యక్షుడిగా శ్రీనివాస్ నియమితులయ్యారు.

8లో▸

న్యూస్‌రీల్

ప్రజా పాలనా కళాయాత్రను విజయవంతం చేయాలి

కలెక్టర్ సి.నారాయణ రెడ్డి



సాక్షి, రంగారెడ్డి జిల్లా: రాష్ట్రంలో ప్రజా పాలన ఏడాది పూర్తైన సందర్భంగా రంగారెడ్డి జిల్లాలో ప్రజాపాలన కళా యాత్రను విజయ వంతం చేయాలని కలెక్టర్ సి.నారాయణ రెడ్డి తెలిపారు. తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారులు ఈ నెల 19 నుంచి డిసెంబర్ 7వరకు ప్రజాపాలన కళా యాత్ర చేపట్టాలని ప్రభుత్వం సంకల్పించిందన్నారు. ఈ మేరకు సన్నాహక ఏర్పాట్లు చేయాలని ఆయన సంబంధిత అధికారులకు సూచించారు. షాద్‌నగర్ సాయిరాజ్ గార్డెన్‌లో ఈ నెల 17న ఆదివారం ప్రజా విజయోత్సవాల కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. షాద్‌నగర్ శాసన సభ్యుడు వీర్లపల్లి శంకర్, తెలంగాణ సంగీత నాటక అకాడమీ చైర్మన్ అలేఖ్య పుంజాల పాల్గొంటారని తెలిపారు. రంగారెడ్డి జిల్లా యంత్రాంగం, పౌర సంబంధాల శాఖ ఆధ్వర్యంలో పనిచేస్తున్న సాంస్కృతిక సారథి కళాకారులు జిల్లాలోని మండలాలు, గ్రామ పంచాయితీలలో రెండు టీములుగా తిరుగుతూ ఆరు గ్యారంటీలపై అవగాహన కల్పిస్తారని కలెక్టర్ వివరించారు.

డాక్టర్ రవీందర్‌రెడ్డికి పాన్ ఇండియా అవార్డు



అవార్డు ప్రదానం చేస్తున్న ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం

షాద్‌నగర్: విద్యారంగంలో ఉన్నత సేవలు అందిస్తున్న షాద్‌నగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకుడు డాక్టర్ సామ రవీందర్‌రెడ్డి పాన్ ఇండియా జాతీయ అవార్డు అందుకున్నారు. వివిధ రంగాల్లో సేవలు అందిస్తున్న వారికి గ్లోబల్ పీస్ అండ్ కల్చర్ అసోసియేషన్, ఆర్ట్స్ అకాడమీ, పుడమి సాహిత్య వేదిక సంయుక్త ఆధ్వర్యంలో ఫిలాంత్ర సొసైటీ సహకారంతో శనివారం పాన్ ఇండియా జాతీయ అవార్డులు అందజేశారు. హైదరాబాద్‌లోని బిర్లా ప్లానిటోనిరియం భాస్కర్ ఆడిటోరియంలో పుడమి సాహిత్య వేదిక జాతీయ అధ్యక్షుడు బాల్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం అవార్డులు అందజేశారు.

కళాశాల నిర్మాణానికి రూ.5లక్షల విరాళం



ఎమ్మెల్యేకు చెక్కు అందజేస్తున్న శివశంకర్‌గౌడ్

షాద్‌నగర్: దాతల సహకారంతో పట్టణంలో నూతనంగా నిర్మిస్తున్న ప్రభుత్వ జూనియర్ కళాశాల భవన నిర్మాణానికి దాతలు రూ.5లక్షల విరాళం అందజేశారు. నందిగామ మాజీ ఎంపీపీ ప్రియాంక, శివశంకర్‌గౌడ్ దంపతులు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌కు ఈ చెక్కు అందజేశారు. పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో వీర్లపల్లి శంకర్ దాతలను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో నాయకులు జంగ నర్సింహ, కొమ్ము కృష్ణ, కావలి శ్రీశైలం, జమ్మద్‌ఖాన్, ముబారక్, చంద్రపాల్, కుమార్‌గౌడ్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మహేశ్వరం మెడికల్ కాలేజీలో డిప్లొమా కోర్సులు

20 వరకు దరఖాస్తుల స్వీకరణ

మహేశ్వరం: మహేశ్వరం ప్రభుత్వ మెడికల్ కళాశాలలో రెండేళ్ల డిప్లొమా కోర్సుల్లో అడ్మిషన్లకు అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. తెలంగాణ పారామెడికల్ బోర్డు ద్వారా డిప్లొమా ఇన్ మెడికల్ ల్యాబ్ టెక్నీషియన్, డిప్లొమా ఇన్ మెడికల్ స్టెరిలైజేషన్ మేనేజ్‌మెంట్ అండ్ ఆపరేషన్ థియేటర్ టెక్నీషియన్ కోర్సులకు ఈ నెల 20 లోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. బీఈ ఐటీ క్యాంపస్ మంగల్‌పల్లి కళాశాల అడ్మిషన్ బ్లాక్‌లో సాయంత్రం 5గంటల లోపు దరఖాస్తులు సమర్పించాలన్నారు. మరిన్ని వివరాలు gmcmaheshwram.org వెబ్‌సైట్‌లో చూసుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ సూచించారు.



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న దిశ కమిటీ చైర్మన్, ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, చిత్రంలో కలెక్టర్ సి.నారాయణరెడ్డి, ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

ఇవేం నివేదికలు..?

హరితహారం మొక్కలు వందశాతం బతికినట్లు చూపిన అధికారులు

- అభ్యంతరం వ్యక్తం చేసిన దిశ కమిటీ సభ్యులు
- రైతులను పాడి పరిశ్రమ, కూరగాయల సాగును ప్రోత్సహించాలి
- ఉపాధి కల్పనకు జాబ్‌మేళాలు ఏర్పాటు చేయాలి
- దిశ కమిటీ చైర్మన్, ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

సాక్షి, రంగారెడ్డి జిల్లా: క్షేత్రస్థాయికి భిన్నంగా అధికారుల నివేదికలు ఉన్నట్లు జిల్లా అభివృద్ధి సమన్వయ, పర్యవేక్షణ కమిటీ(దిశ) అభిప్రాయపడింది. హరితహారంలో భాగంగా నాటిన మొక్కల వివరాలకు.. క్షేత్రస్థాయిలో ఉన్న మొక్కల మధ్య భారీ వ్యత్యాసం ఉందని తేల్చింది. తప్పుడు నివేదికలతో కమిటీని తప్పుదోవ పట్టించడం సరికాదని పేర్కొంది. శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా అభివృద్ధి సమన్వయ, పర్యవేక్షణ కమిటీ(దిశ) సమీక్షా సమావేశం నిర్వహించింది. ఈ సమావేశంలో కమిటీ చైర్మన్, చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, జిల్లా కలెక్టర్ సి.నారాయణరెడ్డి, అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్, షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ పాల్గొన్నారు. కేంద్రం వివిధ పథకాలకు కేటాయించిన బడ్జెట్, లబ్ధిదారుల ఎంపికపై చర్చించారు. అధికారులు సమర్పించిన నివేదికలపై కమిటీ సభ్యులు అభ్యంతరం వ్యక్తం చేశారు. ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

నాటిన మొక్కలకు దిక్కులేదు

హరితహారంలో భాగంగా 2024–25లో 36.25 లక్షల మొక్కలు నాటగా, వీటిలో 31.20 లక్షల మొక్కలు ఏపుగా పెరిగినట్లు జిల్లా గ్రామీణాభివృద్ధిశాఖ అధికారి శ్రీలత తెలిపారు. 2023–24లో 29.22 లక్షల మొక్కలు నాటగా, వందశాతం బతికే ఉన్నట్లు చెప్పడంపై కమిటీ సభ్యులు అభ్యంతరం వ్యక్తం చేశారు. క్షేత్రస్థాయిలోని మొక్కలకు అధికారులు తయారు చేసిన నివేదికలకు పొంతనే లేదని మండిపడ్డారు. ఏ గ్రామ పంచాయితీలోనూ నాటిన మొక్కలు కన్పించడం లేదని.. ఉన్న వాటికి కనీసం నీరు పోసే పరిస్థితి కూడా లేక వాడిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.

మైదానాలు మూసేయడమే ఉత్తమం

జిల్లాలో 495 క్రీడా ప్రాంగణాలు మంజూరు కాగా, వీటిలో 435 పూర్తయ్యాయని తెలిపారు. ఇందుకు దిశ కమిటీ చైర్మన్ కొండా విశ్వేశ్వర్ రెడ్డి అభ్యంతరం వ్యక్తం చేశారు. బోర్డులు తప్ప..ఆట స్థలాలు కన్పించడం లేదని, కనీసం భూమిని కూడా చదును చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. నిర్వహణ లేక నిరుపయోగంగా మారిన ఈ ప్రాంగణాలను మూసివేయడమే ఉత్తమమన్నారు. వీటి నిర్వహణకు ప్రభుత్వం ఆశించిన స్థాయిలో బడ్జెట్ కేటాయించక పోవడంతో తాము కూడా ఏమీ చేయలేని దుస్థితి నెలకొందని గ్రామీణాభివృద్ధి సంస్థ అధికారి ప్రకటించారు.



సమావేశంలో పాల్గొన్న మేయర్లు, మున్సిపల్ చైర్మన్లు, అధికారులు తదితరులు

కూలీకి గిట్టుబాటు కరువు

మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం(ఎంజీఎన్‌ఆర్‌ఈజీపీ) ద్వారా 2024–25 ఆర్థిక సంవత్సరానికి 51,186 కుటుంబాలకు 1,106 రోజుల పని దినాలు కల్పించామని, ఒక్కో వ్యక్తికి రోజుకు సగటున రూ.236.46 చొప్పున ఉపాధి కల్పిస్తున్నట్లు తెలిపారు. కూలీ డబ్బులను వారం రోజుల్లోనే వారి ఖాతాల్లో జమ చేస్తున్నట్లు జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ అధికారి వివరించారు. 'షాద్‌నగర్ నియోజకవర్గంలో ఆశించిన స్థాయిలో పని కల్పించడం లేదు. ఒక వేళ పని కల్పించినా..ఆశించిన కూలీ రావడం లేదు' ఎమ్మెల్యే శంకరయ్య అధికారుల దృష్టికి తీసుకురాగా, అందరికీ సమానంగా పని దినాలు కల్పించి, చేసిన పనికి కూలీ చెల్లిస్తున్నట్లు డీఆర్‌డీఓ స్పష్టం చేశారు.

పాడిపశువుల సంఖ్య పెంచాలి

జిల్లాలో పాల ఉత్పత్తి గణనీయంగా తగ్గిందని.. డిమాండ్‌కు తగిన మేర ఉత్పత్తి లేక సరఫరాదారులు అడ్డదారులు తొక్కుతున్నారని, ఫలితంగా ప్రజారోగ్యం దెబ్బతింటోందని కమిటీ అభిప్రాయపడింది. పాడి ఆవులు, గేదెల సంఖ్యను మరింత పెంచాల్సిన ఆవశ్యకం ఉందన్నారు. పాడి పశువుల ఆరోగ్యాన్ని కాపాడేందుకు మెరుగైన చర్యలు చేపట్టాలని జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారికి ఆదేశాలు జారీ చేశారు. ఫిబ్రవరి నాటికి పశుగణన పూర్తి చేయాలని సూచించారు.

డయాలసిస్‌కు ఇబ్బందులు

జిల్లాలో 81 బస్తీ దవఖానాలకుగాను 70 పని చేస్తున్నాయి. ప్రభుత్వం రిపేర్లు, మౌలిక సదుపాయాల కల్పనకు రూ.2.50 కోట్లు కేటాయించింది. 158 పల్లె దవఖానాలు మంజూరు కాగా, వీటిలో 58 ఆస్పత్రులకు ఏఆర్‌హెచ్‌ఎం కింద రూ.10 కోట్లు మంజూరయ్యాయి. ఒక్కో భవనానికి రూ.20 లక్షలు ఖర్చు చేయనున్నాం. ఇందుకు ఇప్పటికే టెండర్లు సైతం పిలిచాం. అన్ని ప్రభుత్వ ఆస్పత్రుల్లోనూ యాంటి స్నేక్ వీనం మందులు అందుబాటులో ఉంచామని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి వెంకటేశ్వర్‌రావు కమిటీకి వివరించారు. మహేశ్వరం ఆస్పత్రిలో డయాలసిస్ యూనిట్ పని చేయడం లేదని, రోగులకు కనీస సేవలు అందడం లేదని సభ్యులు కమిటీ దృష్టికి తీసుకొచ్చారు.

అధికారుల సేవతోనే ప్రజాప్రతినిధులకు గుర్తింపు

'తాము కేవలం ప్రజాప్రతినిధులం. ప్రజలకు సేవ చేసేది అధికారులే. వారు చేసే సేవలే ప్రజాప్రతినిధులకు, ప్రభుత్వానికి గుర్తింపు తెచ్చిపెడతాయి' అని ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి చెప్పారు. ఇందుకు సమన్వయంతో పని చేయాల్సిన అవసరం ఉందన్నారు. మరింత శ్రమించి జిల్లాను అన్ని రంగాల్లో ముందు ఉంచాలని సూచించారు. గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీల్లో సమస్యలను తెలుసుకున్నారు. మరుగుదొడ్లు లేని పాఠశాలలను గుర్తించి, వెంటనే వాటిని ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. రాజధానికి సమీపంలో జిల్లా ఉన్నందున పాలు, కాయగూరలకు డిమాండ్ ఎక్కువగా ఉంటుందని, రైతులను ఆ దిశగా ప్రోత్సహించాలని సంబంధిత అధికారులను కోరారు. యువతకు ఉపాధి కల్పించే దిశగా జాబ్ మేళాలు నిర్వహించాలని జిల్లా ఉపాధి కల్పనశాఖ అధికారికి సూచించారు. సమావేశంలో మున్సిపల్ చైర్మన్లు, కార్పొరేషన్ మేయర్లు, వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

కోలాహలంగా చిన్న తేరు

కడ్తాల్: మండల పరిధిలోని మైసిగండిలో కొలువైయున్న మైసమ్మ తల్లి చిన్న తేరు(పుష్ప రథోత్సవం) భక్తజన కోలాహలం మధ్య శనివారం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఆలయార్చకులు ప్రత్యేక పూజలు చేసిన అనంతరం అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని ప్రత్యేక పూల రథంపై ఉంచి ఆలయ పరిసరాల్లో ఊరేగింపు ప్రారంభించారు. రథోత్సవం సందర్భంగా అమ్మవారి నామస్మరణతో ఆలయ పరిసరాలు మార్మోగాయి. ఈ కార్యక్రమంలో ఆలయ ఫౌండర్ ట్రస్టీ శిరోలి, ఈఓ స్నేహలత, ఆలయ నిర్వాహకులు భాస్కర్ నాయక్, అరుణ్ కుమార్ స్థానిక నాయకులు ఆలయ అర్చక సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



మైసిగండిలో చిన్నపుష్ప రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

రహదారి పనులకు రైతులు బ్రేక్



రాచులూరు రెవెన్యూలో నిరసన తెలుపుతున్న రైతులతో మాట్లాడుతున్న తహసీల్దార్ గోపాల్, రవికాంత్‌రెడ్డి తదితరులు

- ఫ్యూచర్ సిటీ రోడ్డు నిర్మాణానికి హద్దురాళ్ల ఏర్పాటు
- సమాచారం ఇవ్వకుండా పనులు ఎలా చేపడుతారని ఆగ్రహం
- అధికారులు నచ్చజెప్పినా ససేమీరా
- రవికాంత్‌రెడ్డి భరోసాతో శాంతించిన రైతులు

కందుకూరు: ఫోర్త్‌సిటీ వరకు నిర్మించనున్న 300 అడగుల రహదారి నిర్మాణానికి సంబంధించిన భూ సేకరణ పనులకు ఆదిలోనే అడ్డంకులు ఎదురయ్యాయి. రాష్ట్ర ప్రభుత్వం రావిర్యాల ఓఆర్‌ఆర్ ఎగ్జిట్ నంబర్–13 నుంచి ఫోర్త్ సిటీ వరకు 300 అడుగుల మేర రోడ్డు నిర్మాణానికి ప్రతిపాదించింది. ఈ మేరకు శనివారం సర్వేయర్ సాయికాంత్, ఆర్‌ఐ యాదయ్య బృందం మండల పరిధిలోని రాచలూరు రెవెన్యూలో ఫోర్త్ సిటీ వరకు రహదారి నిర్మాణానికి హద్దురాళ్ల ఏర్పాటు చేసే పనులు ప్రారంభించింది. విషయం తెలుసుకుని భూములు కోల్పోతున్న రాచులూరు, తుర్కగూడ, గాజులబురుజుతండా, బేగంపేటకు చెందిన రైతులు పనులను అడ్డుకుని నిరసన తెలిపారు. తాము కోల్పోతున్న భూమికి భూమి ఇస్తారా? లేక పరిహారం ఇస్తారా ఏదీ తేల్చకుండానే హద్దురాళ్ల ఎలా ఏర్పాటు చేస్తారని ప్రశ్నించారు. ఆర్డీఓ, తహసీల్దార్ రావాలంటూ భీష్మించారు. విషయం తెలుసుకున్న తహసీల్దార్ గోపాల్, సీఐ సీతారాం పోలీసులతో అక్కడికి చేరుకుని రైతులను సముదాయించినా ఫలితం లేదు. చివరకు రాచులూరుకు చెందిన అర్జున అవార్డు గ్రహీత వెదిరె రవికాంత్‌రెడ్డి రైతులతో మాట్లాడారు. రైతులకు ఏమీ కావాలో అడిగితెలుసుకున్నారు. సోమవారం కలెక్టర్‌ను కలిసి మాట్లాడదామని, రైతులకు న్యాయం జరిగేలా చూస్తానని, అప్పటి వరకు పనులను అడ్డుకోవద్దని వారికి భరోసా కల్పించడంతో రైతులు శాంతించారు.

గ్రూప్-3కి పటిష్ట బందోబస్తు

- అడిషనల్ డీసీపీ సత్యనారాయణ
- ఇబ్రహీంపట్నం డివిజన్‌లో 23 పరీక్ష కేంద్రాలు



ఇబ్రహీంపట్నం: సమావేశంలో అడిషనల్ డీసీపీ సత్యనారాయణ

ఇబ్రహీంపట్నం: నేడు, రేపు నిర్వహించే గ్రూప్–3 పరీక్షల నిర్వహణకు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయాలని పోలీసు అధికారులను మహేశ్వరం అడిషనల్ డీసీపీ సత్యనారాయణ ఆదేశించారు. శనివారం సాయంత్రం ఆయన డివిజన్ పరిధిలోని సెయింట్ ఇంజనీరింగ్ కళాశాలలో పోలీసు సిబ్బందితో సమావేశం ఏర్పాటు చేసి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్ట్రాంగ్ రూం నుంచి ఆయా పరీక్ష కేంద్రాలకు ప్రశ్నాపత్రాలు తరలించే క్రమంలో బందోబస్తును పర్యవేక్షిస్తుండాలన్నారు. ఇబ్రహీంపట్నం డివిజన్ పరిధిలో 23 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఆయా పరీక్ష కేంద్రాలల్లో సుమారు 14 వేల మంది అభ్యర్థులు ఈ పరీక్షలకు హాజరుకానున్నారు. ఆదివారం ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 12.30వరకు మొదటి పేపర్, మధ్యాహ్నం 3గంటల నుంచి సాయంత్రం 5.30గంటల వరకు రెండో పేపర్, సోమవారం ఉదయం మూడోపేపర్ ఉంటుందన్నారు. ప్రతీ పరీక్ష కేంద్రం వద్ద ఒక సీఐ, ఒక ఎస్‌ఐతోపాటు పది మంది పోలీసు సిబ్బంది ఉండేలా బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు. అనంతరం పరీక్ష కేంద్రాల రూట్ మ్యాప్‌ను పరిశీలించారు. ఈ సమావేశంలో ఇబ్రహీంపట్నం ఏసీపీ కేపీవీ రాజు, సీఐలు సత్యనారాయణ, నర్సింహారావు, ఎస్‌ఐలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



మొయినాబాద్: ఏర్పాట్లను పరిశీలిస్తున్న తహసీల్దార్ గౌతమ్‌కుమార్

మొయినాబాద్‌లో పది పరీక్ష కేంద్రాలు

మొయినాబాద్: గ్రూప్–3 పరీక్షలకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఆదివారం, సోమవారం రెండు రోజులు జరిగే ఈ పరీక్షలకు మండల పరిధిలో పది కేంద్రాలను ఏర్పాటు చేశారు. శనివారం మొయినాబాద్ తహసీల్దార్ గౌతమ్‌కుమార్ పరీక్ష కేంద్రాలను పరిశీలించారు. కేజీరెడ్డి ఇంజనీరింగ్ కళాశాల, గ్లోబల్ ఇంజనీరింగ్ కళాశాల, చాలెంజర్ ఇంటర్నేషనల్ స్కూల్, సుజాతా స్కూల్, ఎన్టీఆర్ మోడల్ స్కూల్, విద్యాజ్యోతి ఇంజనీరింగ్ కళాశాల, చైతన్య డీమ్డ్ టూ బీ యూనివర్సిటీ, జేబీఆర్‌ఈసీ కళాశాల, జేబీఐఈటీ కళాశాల, కేఎల్‌హెచ్ డీమ్డ్ టూ బీ యూనివర్సిటీల్లో ఏర్పాటు చేసిన ఈ కేంద్రాల్లో మొత్తం 6,724 మంది అభ్యర్థులు పరీక్ష రాయనున్నారు.

పేలిన రిఫ్రిజిరేటర్ సిలిండర్

అపార్ట్‌మెంట్‌లో మంటలు

- రూ. 50 లక్షల ఆస్తి నష్టం



ఎంట్రన్స్‌లోనే నిలిచిపోయిన ఫైరింజన్



ఫ్లాట్‌లో వ్యాపించిన మంటలు

మణికొండ: రిఫ్రిజిరేటర్‌లోని గ్యాస్ సిలిండర్ పేలి మంటలు రావడంతో అపార్ట్‌మెంట్‌లోని ఓ ఫ్లాట్ కిచెన్, హాల్, బెడ్ రూంల వరకు వ్యాపించడంతో అందులోని వ్యక్తులు హాహాకారాలు చేస్తూ కిందకు పరుగులు తీశారు. గేటెడ్ కమ్యూనిటీలో నిబంధనలకు విరుద్ధంగా రోడ్డు స్థలంలో పార్కును అభివృద్ధి చేయటంతో అగ్నిమాపక వాహనాలు ప్రమాదం జరిగిన అపార్ట్‌మెంట్ వరకు సకాలంలో చేరలేక పోయాయి. మణికొండ మున్సిపాలిటీ, పుప్పాలగూడలోని గోల్డెన్ ఓరియల్ కమ్యూనిటీలోని బీ బ్లాక్ మూడో అంతస్తులోని 301 ఫ్లాట్‌లో శనివారం తెల్లవారు జామున ఒక్కసారిగా ఫ్రిడ్జిలోని సిలిండర్ పేలి మంటలు చెలరేగడంతో వంట గది మొత్తం అంటుకుని అన్ని గదులకూ వ్యాపించాయి. మంటలు గ్యాస్ సిలిండర్‌కు అంటుకోవటంతో పెద్ద శబ్దంతో పేలిపోయింది. దీంతో ఇంటి యజమాని వెంకటరమణతో పాటు మిగతా నలుగురు కుటుంబ సభ్యులు కిందకు వచ్చేశారు. చట్టు పక్కల వారు సైతం నిద్రనుంచి మేలుకుని అగ్నిమాపక శాఖకు సమాచారం ఇచ్చి మంటలను ఆర్పేందుకు ప్రయత్నం చేశారు.

అపార్ట్‌మెంట్ వరకూ వెళ్లలేక పోయిన ఫైరింజిన్..

గోల్డన్ ఓరియల్‌లో రెండు బ్లాక్‌ల మధ్య ఉన్న రోడ్డును పార్కుగా మార్చారు. సకాలంలోనే గేటు వద్దకు చేరుకున్న మూడు ఫైరింజిన్‌లు ఫ్లాట్ వద్దకు చేరుకోలేక 300 మీటర్ల దూరంలోనే నిలిచిపోయాయి. దీంతో ఫ్లాట్ పూర్తిగా కాలిపోయిందని అగ్నిమాపక అధికారులు తెలిపారు. గంట సమయం దాని వద్దకు చేరుకునేందుకు ప్రయత్నం చేసినా సఫలం కాక పక్క బ్లాక్ నుంచి నీటిని చల్లి మంటలను ఆర్పారు. అంతలోపే పక్క ఫ్లాట్‌ల నుంచి పైపులను వేసి సాధ్యమైనంత వరకు నివాసితులు మంటలను ఆర్పారు. అంతలోపే మంటలు ఫ్లాట్ మొత్తం వ్యాపించి విలువైన గృహోపకరణాలతో పాటు దుస్తులు, నగదు కాలిపోవటంతో రూ.50లక్షల వరకు నష్టం వాటిల్లినట్లు ఫ్లాట్ యజమాని తెలిపారు.

కేసు నమోదు

గోల్డెన్ ఓరియల్ గేటెడ్ కమ్యూనిటీ అపార్ట్‌మెంట్‌లో జరిగిన అగ్ని ప్రమాదంపై ఇంటి యజమాని వెంకటరమణ నార్సింగి పోలీసులకు ఫిర్యాదు చేశారు.

రెండు బైకులు ఢీ

ఇరువురికి గాయాలు



గాయపడిన మల్లేశ్

కేశంపేట: ఎదురెదురుగా వచ్చిన రెండు బైకులు ఢీకొనడంతో ఇరువురుకి తీవ్ర గాయలైన సంఘటన మండల పరిధిలో లేమామిడి శివారులో శనివారం చోటు చేసుకుంది. స్థానికుల తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన కమ్మరి నందంచారి వ్యవసాయ పొలం పనులు ముగించుకుని సాయంత్రం బైక్‌పై ఇంటికి వెళ్తున్నాడు. ఈ సమయంలో పోమాల్‌పల్లికి చెందిన మల్లేశ్ తన బైక్‌పై తలకొండపల్లి వెళ్తున్నాడు. లేమామిడి వద్ద వీరి బైక్‌లు ఎదురెరుగా ఢీకొన్నాయి. ఈ ఘటనలో ఇరువురికీ గాయాలవగా అంబులెన్స్‌లో ఆస్పత్రికి తరలించారు.

కారు ఢీకొని ప్రభుత్వ ఉద్యోగి మృతి

శంషాబాద్: కారు ఢీకొని ప్రభుత్వ ఉద్యోగి మృతిచెందిన సంఘటన ఆర్‌జీఐఏ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల సమాచారం మేరకు... మండలంలోని పోశెట్టిగూడ గ్రామానికి చెందిన కావలి దశరథ(40) జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నాడు. శుక్రవారం రాత్రి పట్టంలోని ఫ్లైఓవర్ మీదుగా బైక్‌పై ఇంటికి వెళుతుండగా కారు ఢీ కొనడంతో తీవ్ర గాయాలయ్యాయి. తీవ్ర గాయాలపాలైన అతడిని వెంటనే ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అయితే అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వేర్వేరు ప్రాంతాల్లో ముగ్గురు అదృశ్యం



షేక్ నూర్



మహ్మద్ సిరాజుద్దీన్

పహాడీషరీఫ్: బాలిక అదృశ్యమైన సంఘటన పహాడీషరీఫ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం.. బీహార్ రాష్ట్రానికి చెందిన వినోద్ రామ్ కుటుంబం ఐదు నెలల క్రితం జల్‌పల్లి శ్రీరాం కాలనీకి వలస వచ్చింది. అతని చిన్న కూతురు(16) కాలనీలోని పేపర్ ప్లేట్స్ తయారీ కంపెనీలో పని చేస్తోంది. ఈ నెల 15న కుటుంబ సభ్యులంతా నిద్రించి శనివారం ఉదయం 6గంటలకు లేచి చూడగా కనిపించలేదు. ఆందోళనకు గురైన కుటుంబ సభ్యులు ఎక్కడ వెతికినా ఆమె ఆచూకీ లభించలేదు. తాను పనిచేసే కంపెనీలోనే ఎవరో తీసుకుపోయి ఉంటారని బాలిక తల్లి సునీతా దేవి పోలీసులకు ఫిర్యాదు చేసింది. బాలిక ఆచూకీ తెలిసిన వారు పోలీస్‌స్టేషన్‌లో గాని 87126 62367 నంబర్ గాని సమాచారం అందించాలని కోరారు. కేసు దర్యాప్తులో ఉంది

అత్తాపూర్: వేర్వేరు ప్రాంతాల్లో ఇద్దరు అదృశ్యమయ్యారు. పోలీసుల సమాచారం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. అత్తాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని హసన్‌నగర్ ప్రాంతానికి చెందిన షేక్ నూర్(40) జూలై 22వ తేదీన ఇంట్లో చెప్పకుండా బయటకు వెళ్లాడు. అతడి కోసం ఫోన్‌లు చేసిన స్విచ్ ఆఫ్ వస్తుంది. అతడి ఆచూకీ కోసం చుట్టు పక్కల ప్రాంతాలు, బంధువులు, స్నేహితుల వద్ద వాకాబు చేసిన ఎలాంటి ఆచూకీ లభించలేదు. దీంతో భార్య షబానా బేగం అత్తాపూర్ పోలీసులకు ఫిర్యాదు చేసింది.

- అత్తాపూర్ హసనగర్‌నగర్ ప్రాంతానికి చెందిన మహ్మద్ సిరాజుద్దీన్ కురేషి(42) ఈ నెల 12వ తేదీన ఇంట్లో చెప్పకుండా వెళ్లిపోయాడు. అతడి కోసం భార్య పరిసర ప్రాంతాలు, బంధువులు, స్నేహితుల వద్ద వాకాబు చేసినా ఆచూకీ లభించలేదు. దీంతో ఆమె పోలీసులు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు పోలీసులు వేర్వేరుగా కేసులు నమోదు చేసి దర్యాప్తు ప్రాంభించారు.

నిర్దేశిత రుణ లక్ష్యాలను చేరుకోవాలి



పట్టణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి దానకిశోర్

సాక్షి, సిటీబ్యూరో: మహిళా స్వయం సహాయక సంఘాలకు (ఎస్‌హెచ్‌జీ) నిర్దేశిత లక్ష్యాల మేరకు బ్యాంకు లింకేజీ ద్వారా రుణ సదుపాయం కల్పించాలని పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి దానకిశోర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. శనివారం ఎంఏయూడీ కార్యాలయంలో జీహెచ్ఎంసీ, మెప్మా అధికారులతో ఎస్‌హెచ్‌జీల బ్యాంకు లింకేజీ టార్గెట్, కొత్త గ్రూపుల ఏర్పాటు, ఎంటర్ ప్రెన్యూర్‌షిప్ కార్యకలాపాల అభివృద్ధి తదితరాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, లక్ష్య సాధనకు నెలవారీ కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని, జీహెచ్ఎంసీ బ్యాంకు లింకేజీ ద్వారా ఎస్‌హెచ్‌జీలకు నెలకు కనీసం రూ. 200 కోట్ల రుణాలు అందించాలన్నారు. బ్యాంకర్లతో వర్క్‌షాప్ ఏర్పాటు చేయాలని, ఎంటర్ ప్రెన్యూర్ షిప్ అభివృద్ధికి స్థానిక ఎన్జీఓలను, సివిల్ సొసైటీ ఆర్గనైజేషన్లను గుర్తించాలన్నారు. అర్హులైన మహిళలను గుర్తించి కొత్త ఎస్‌హెచ్‌జీలను ఏర్పాటు చేయాలన్నారు. పాత గ్రూపులను పటిష్ట పరిచేందుకు ప్రాధాన్యమివ్వాలని సూచించారు. డిసెంబర్ 7, 8, 9 తేదీల్లో ట్యాంక్ బండ్ వద్ద నిర్వహించే కార్నివాల్ కోసం కార్యక్రమాల నిర్వహణకు ప్రణాళిక సిద్ధం చేయాలన్నారు. కార్యక్రమంలో సీడీఎంఏ డైరెక్టర్ శ్రీదేవి, ఎంఏయూడీ డిప్యూటీ సెక్రటరీ ప్రియాంక, జీహెచ్ఎంసీ అడిషనల్ కమిషనర్ (యూసీడీ) చంద్రకాంత్ రెడ్డి, జాయింట్ కమిషనర్ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

బీసీ మహాసభ జిల్లా అధ్యక్షుడిగా శ్రీను



నియామకపత్రం అందుకుంటున్న శ్రీనివాస్

షాద్‌నగర్‌రూరల్: బీసీ మహాసభ జిల్లా అధ్యక్షుడిగా క్యాసెట్ శ్రీనివాస్ నియమితులయ్యారు. శనివారం పట్టణంలోని విశ్రాంత ఉద్యోగుల భవనంలో బీసీ మహాసభ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మానపాటి ప్రదీప్‌కుమార్ ఆధ్వర్యంలో బీసీ మహాసభ సమావేశాన్ని నిర్వహించారు. బీసీ మహాసభ విస్తృత నిర్మాణంలో భాగంగా బీసీ మహాసభ జిల్లా కమిటీని ఎన్నుకున్నారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా బీసీ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు మెట్టుకాడి శ్రీనివాస్ హాజరై నియామకపత్రాలు అందజేశారు. కమిటీ ఉపాధ్యక్షుడిగా గోపాల్, ప్రధాన కార్యదర్శిగా యాదయ్య, కార్యదర్శిగా బన్సీలాల్, కోశాధికారిగా వెంకటాచారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. బీసీ మహాసభ యువత విభాగం జిల్లా అధ్యక్షుడిగా శ్రీధర్‌వర్మ, ఉపాధ్యక్షులుగా మంగవెంకటేశ్, ప్రధాన కార్యదర్శిగా శ్రీశైలం, కార్యదర్శిగా మహేష్‌గౌడ్, కోశాధికారిగా శ్రీనివాసాచారి, ప్రచార విభాగం రాష్ట్ర అధ్యక్షుడిగా సురేష్, మహిళా విభాగం రాష్ట్ర కార్యదర్శిగా లలిత, జిల్లా ప్రచార కమిటీ ఇన్‌చార్జిగా మల్లేష్‌ని ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో కృష్ణాజీ, ఆంజనేయులు, వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.